RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా


తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 101 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | మంగళవారం | 13.10.2026 | పేజీలు : 8

చీఫ్ జస్టిస్ రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ పోస్టు.. విమర్శలతో డిలీట్!

- శాంతి భద్రతలు తన పరిధిలోకి రావన్న జస్టిస్ సూర్యకాంత్
- ఢిల్లీలో నిరసనలపై మీడియా ప్రశ్నకు పై విధంగా బదులిచ్చిన చీఫ్ జస్టిస్
- వీటిని ఉద్దేశించి సూర్యకాంత్ రాజీనామా చేయాలంటూ కేరళ కాంగ్రెస్ 'ఎక్స్'లో పోస్ట్



2

ఎస్ఐఆర్ రగడ.. సుప్రీం మెట్లెక్కిన ఇండియా కూటమి నేతలు

- ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టులో పిటిషన్
- రాహుల్ గాంధీ సహా 11 మంది 'ఇండియా' కూటమి నేతల పిటిషన్
- ఓటర్లను భారీగా తొలగించారని, అవకతవకలు జరిగాయని ఆరోపణ

2

'NO' అని రిప్లై ఇచ్చినందుకే ఒకరి బ్యాంక్ ఖాతా నిలువునా ఖాళీ..! - సజ్జనార్

- వాట్సాప్‌లో 'NO' అని రిప్లై ఇస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ
- ఇది సైబర్ నేరగాళ్ల సరికొత్త ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్
- ఓటీపీ, లింకులు లేకుండానే జరుగుతున్న మోసం
- మోసపోతే 1930కి కాల్ చేయాలని విజ్ఞప్తి



2

మొన్నటి దాకా ఈడీ, సిబిఐ..

ఇప్పుడు ఈసీ

- కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్

- కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్
- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు



నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (SIR) ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ..... మిగతా 2 వ పేజీ లో..

ఆరు రాష్ట్రాలకు నూతన గవర్నర్లు..
రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులు



- కేరళ నూతన గవర్నర్‌గా ఓం ప్రకాశ్ మాథుర్
- తమిళనాడు గవర్నర్‌గా రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్
- కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకూ కొత్త గవర్నర్లు

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : దేశంలోని ఆరు రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం నూతన గవర్నర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల ప్రకారం కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు బాధ్యతలు చేపట్టనున్నారు. కొందరిని బదిలీ చేయగా, మరికొందరిని కొత్తగా నియమించారు. వివరాల్లోకి వెళితే, ప్రస్తుతం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మాథుర్‌ను కేరళ నూతన గవర్నర్‌గా నియమించారు. ఇప్పటివరకు కేరళ గవర్నర్‌గా పనిచేసిన రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను తమిళనాడు .... మిగతా 2వ పేజీ లో..

రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్..

- టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!

- రేడియల్ రోడ్ టెండర్లలో అవకతవకలంటూ రాజగోపాల్ రెడ్డి ఆరోపణ
- రూ.600 కోట్లు తక్కువకు బిడ్ వేసినా తమను తప్పించారని మండిపాటు
- సీఎం రేవంత్ శాఖలోనే దోపిడీ జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు



2

ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?
: ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

- సింగూరు ప్రాజెక్టు నీటిని మళ్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- రాష్ట్రంలో కరెంట్ కోతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న మాజీ మంత్రి
- కోట్ల మంది తాగునీటి అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శ



నిత్యం నిఘా, హైదరాబాద్ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగు..... 2

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన.. చార్జీల తగ్గింపుకు కసరత్తు

- ఆర్టీసీ-మెట్రో పాస్ చార్జీలపై సమీక్ష
- త్వరలో కొత్త ధరలు ప్రకటిస్తామన్న మంత్రి పొన్నం
- ధరలు భారంగా ఉన్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు



నిత్యం నిఘా, హైదరాబాద్ : హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ చార్జీలపై తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్‌కు రూ. 400 (మెట్రోకు రూ. 300, ఆర్టీసీకి రూ. 100), నెలవారీ పాస్‌కు రూ. 8,500 (మెట్రోకు రూ. 7,000, ఆర్టీసీకి రూ. 1,500) చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ ధరల నిర్ణయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన సూచన మేరకు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని .....

2

జేఎన్‌యూ ఘటన
: రాహుల్, ప్రియాంక మౌనంపై పురందేశ్వరి ఫైర్



- కాంగ్రెస్ ఎంపీపై లైంగిక వేధింపుల ఆరోపణలు
- నిందిత ఎంపీని కాంగ్రెస్ కాపాడుతోందన్న పురందేశ్వరి
- మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శ

నిత్యం నిఘా, హైదరాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ లో కాంగ్రెస్ ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చిన ఘటనపై ఆ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మౌనంగా ఉండటంపై బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఆరోపణ కాదని, నిజమని తేలిన వాస్తవమని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంపై పురందేశ్వరి మాట్లాడుతూ... "జేఎన్‌యూ పరిపాలన విభాగం నియమించిన అంతర్గత విచారణ కమిటీ నివేదికలో, నిందితుడైన కాంగ్రెస్ ఎంపీ 11 మంది విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు స్పష్టంగా తేలింది... 2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఆరు రాష్ట్రాలకు నూతన గవర్నర్లు..
రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులు

మొదటిపేజీ తరువాయి.. గవర్నర్‌గా బదిలీ చేశారు. ఇక, కర్ణాటక కొత్త గవర్నర్‌గా డాక్టర్ సుధా యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్రపతి భవన్ నిర్ణయం తీసుకుంది. ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, ఒడిశా గవర్నర్‌గా బ్రిజ్ మోహన్ రామ్, ఉత్తరాఖండ్ గవర్నర్‌గా డాక్టర్ ధల్ సింగ్ బిసెన్‌ను నియమించారు. ఓం ప్రకాశ్ మాథుర్ కేరళకు బదిలీ కావడంతో, ఖాళీ అయిన సిక్కిం గవర్నర్ పదవిలో దుష్యంత్ గౌతమ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ తన ప్రకటనలో పేర్కొంది. ఈ నియామకాలన్నీ సంబంధిత వ్యక్తులు తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి తక్షణమే అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి కార్యాలయం జారీ చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది.

జేఎన్‌యూ ఘటన
రాహుల్, ప్రియాంక మౌనంపై పురందేశ్వరి ఫైర్

మొదటిపేజీ తరువాయి.. కాంగ్రెస్ ఎంపీపై ఇంతటి తీవ్రమైన నేరం రుజువైనప్పటికీ రాహుల్, ప్రియాంక ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరం" అని అన్నారు. పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా ప్రచారం చేసే రాహుల్ గాంధీ, ఈ విషయంలో మౌనంగా ఉంటూ నిందితుడికి పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని ఆమె ఆరోపించారు. కనీసం ఒక ప్రకటన కూడా చేయకపోవడం అంటే నిందితుడిని కాపాడటమేనని విమర్శించారు. ఈ దుష్ప్రవర్తనకు పాల్పడిన ఎంపీని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో బహిష్కరించాల్సిందని, కానీ అతనికి రక్షణ కల్పించడం ద్వారా ఆ పార్టీ ద్వంద్వ వైఖరి బయటపడిందని పురందేశ్వరి దుయ్యబట్టారు. మహిళల భద్రత, గౌరవం పట్ల కాంగ్రెస్ నాయకులకు ఉన్న చిత్తశుద్ధిని ఆమె ప్రశ్నించారు. నిందితుడిపై తక్షణమే కఠినమైన చట్టపరమైన, రాజకీయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీజేపీ మహిళా మోర్చా పురందేశ్వరి నేతృత్వంలో ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేపట్టింది.

ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?
: ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

మొదటిపేజీ తరువాయి.. నీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన
- చార్జీల తగ్గింపుకు కసరత్తు

మొదటిపేజీ తరువాయి.. చార్జీలను పునఃపరిశీలించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడమేనని, ప్రజలపై అదనపు భారం మోపడం తమ లక్ష్యం కాదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రయాణికుల అవసరాలు, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశమై అందరికీ అందుబాటులో ఉండేలా ధరలపై సరైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ పథకం ద్వారా ప్రయాణికులకు మేలు చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.

రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్..
టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (HGCL) ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు. మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు
- కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్

మొదటిపేజీ తరువాయి..
ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు–బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు–గిరిజనులు–బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

చీఫ్ జస్టిస్ రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ పోస్టు.. విమర్శలతో డిలీట్!

మొదటిపేజీ తరువాయి..
భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ కేరళ విభాగం చేసిన పోస్టు రాజకీయ దుమారం రేపింది. విమర్శలు వెల్లువెత్తడంతో కొన్ని గంటలకే ఆ పోస్టును తొలగించింది. ఢిల్లీలో జరుగుతున్న నిరసనలు శాంతిభద్రతలకు సంబంధించిన అంశమని, అది తన పరిధిలోకి రాదని సీజేఐ వ్యాఖ్యానించడంపై కాంగ్రెస్ ఈ విధంగా స్పందించింది. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో కాంగ్రెస్ కేరళ విభాగం స్పందిస్తూ.. "జస్టిస్ సూర్యకాంత్ గారూ.. శాంతిభద్రతలు మీ పరిధిలో లేకపోతే వెంటనే రాజీనామా చేయండి. ఆ బాధ్యతలు నిర్వహించగల వ్యక్తిని మేం వెతుక్కుంటాం" అని పేర్కొంది. ఈ వ్యాఖ్యలపై బీజేపీ కేరళ విభాగం తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ న్యాయవ్యవస్థను బెదిరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. ఎమర్జెన్సీ రోజులను ప్రస్తావిస్తూ.. అప్పట్లో న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకొచ్చిన రోజులు ముగిశాయని బీజేపీ పేర్కొంది. ప్రధాని మోదీ నాయకత్వంలోని నూతన భారతదేశంలో అలాంటి ప్రయత్నాలు సాగవంటూ 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఇరు పార్టీల మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు దారి తీసింది. సోమవారం ఢిల్లీలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) 33వ వార్షికోత్సవ కార్యక్రమం సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో నిరసనలు, వాటిపై ఆంక్షల గురించి ప్రశ్నించగా, "ఇది శాంతి భద్రతలకు సంబంధించిన అంశం. ఇది నా పరిధిలోకి రాదు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలే కాంగ్రెస్ విమర్శలకు కారణమయ్యాయి. మరోవైపు, ఓటర్ల జాబితా వివాదంపై ప్రతిపక్ష కూటమి 'ఇండియా' నేతలు సమావేశం కోరిన అంశంపైనా సీజేఐ స్పందించారు. సుప్రీంకోర్టు తలుపులు అందరికీ తెరిచే ఉంటాయన్నారు. పౌరులు లేదా ప్రజాప్రతినిధులు పిటిషన్ ద్వారా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని తెలిపారు. ప్రతిపక్షాల అభ్యర్థన తనకు అందిందని, అయితే వారు లేవనెత్తిన అంశాలు ఇప్పటికే సుప్రీంకోర్టు విచారణ పరిధిలో ఉన్నందున ప్రత్యేకంగా సమావేశం కావడం సముచితం కాదని లేఖ ద్వారా వివరించినట్లు చెప్పారు. సమావేశానికి బదులుగా న్యాయపరమైన మార్గాన్ని అనుసరించి పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు. ఇదే తరహా అంశాలపై అక్టోబర్ 13న విచారణ జరగాల్సి ఉందని కూడా పేర్కొన్నారు.

'NO' అని రిప్లై ఇచ్చినందుకే ఒకరి బ్యాంక్ ఖాతా నిలువునా ఖాళీ ..!: సజ్జనార్

మొదటిపేజీ తరువాయి.. ఓటీపీ చెప్పాల్సిన పనిలేదు, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయక్కర్లేదు.. కేవలం 'NO' అని రెండక్షరాల సమాధానం ఇస్తే చాలు.. మీ బ్యాంక్ ఖాతాలోని సొమ్ము క్షణాల్లో మాయం! సాంకేతికతను వాడుకుని సైబర్ నేరగాళ్లు పన్నిన ఈ సరికొత్త పన్నాగం ఇప్పుడు పెను సవాలుగా మారింది. 'ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్'గా పిలుస్తున్న ఈ ప్రమాదకరమైన మోసంపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఈ మోసం ఎలా పని చేస్తుందో, దాని నుంచి ఎలా రక్షించుకోవాలో ఆయన సమగ్రంగా వివరించారు.

మోసం ఎలా జరుగుతుందంటే..

సైబర్ కేటుగాళ్లు పక్కా ప్రణాళికతో ఈ మోసానికి పాల్పడుతున్నారు. ముందుగా, గుర్తుతెలియని వాట్సాప్ నంబర్ నుంచి మీ ఫోన్‌కు ఒక సందేశం వస్తుంది. 'మీ బ్యాంక్ ఖాతా నుంచి ఇంత మొత్తం డెబిట్ అయ్యింది' అని ఆ మెసేజ్‌లో ఉంటుంది. అది చూసిన వెంటనే ఎవరైనా కంగారుపడటం సహజం. ఆ కంగారును ఆసరాగా చేసుకుని, వెంటనే మరో సందేశం పంపుతారు. 'ఈ లావాదేవీ మీరు చేయకపోతే, వెంటనే NO అని రిప్లై ఇవ్వండి' అని అందులో సూచిస్తారు. ఖాతాలో డబ్బులు పోయాయన్న ఆందోళనతో చాలామంది ఆలోచించకుండా 'NO' అని టైప్ చేసి పంపేస్తారు.

అక్కడే అసలు మోసం దాగి ఉంది. మీరు 'NO' అని సమాధానం పంపిన మరు క్షణమే, ఆ సందేశంలో కంటికి కనిపించకుండా దాగి ఉన్న మాల్‌వేర్ స్క్రిప్ట్స్ లేదా ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్స్ యాక్టివేట్ అవుతాయి. ఈ ఫైల్స్ హ్యాకర్లకు మీ మొబైల్ ఫోన్‌పై పూర్తి నియంత్రణను (రిమోట్ యాక్సెస్) అందిస్తాయి. దీంతో వారు మీ ఫోన్‌లోని బ్యాంకింగ్ యాప్‌లు, పాస్‌వర్డ్‌లు, ఇతర సున్నితమైన సమాచారాన్ని సులభంగా దొంగిలించి, క్షణాల్లో మీ బ్యాంక్ ఖాతాను పూర్తిగా ఖాళీ చేస్తారు. ఇటీవల ఓ చార్టర్డ్ అకౌంటెంట్ సైతం ఈ మోసం బారిన పడి భారీగా నష్టపోయిన ఘటన ఈ దాడి తీవ్రతకు అద్దం పడుతోంది.

ప్రజలకు సజ్జనార్ కీలక సూచనలు

ఈ ప్రమాదకరమైన మోసం నుంచి ప్రజలు తమను తాము కాపాడుకోవడానికి వీసీ సజ్జనార్ పలు కీలక సూచనలు చేశారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి బ్యాంక్ లావాదేవీల పేరుతో వచ్చే సందేశాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ 'YES' లేదా 'NO' అని రిప్లై ఇవ్వకూడదు. అలాంటి సందేశాలు రాగానే కంగారు పడకుండా, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి, చాట్‌ను పూర్తిగా డిలీట్ చేయాలి. నిజంగా మీ ఖాతా నుంచి డబ్బు కట్ అయిందో లేదో తెలుసుకోవడానికి మీ బ్యాంక్ అధికారిక మొబైల్ యాప్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెక్ చేసుకోవాలి. వాట్సాప్ సందేశాలను అస్సలు నమ్మవద్దు. ఏ అధికారిక బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ కూడా వాట్సాప్ ద్వారా ఇలాంటి లావాదేవీల ధ్రువీకరణ కోరదని గుర్తుంచుకోవాలి.

మోసపోతే ఏం చేయాలి?

ఒకవేళ పొరపాటున ఎవరైనా ఈ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా 'గోల్డెన్ అవర్'లో స్పందించాలని సజ్జనార్ సూచించారు. వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ '1930'కి కాల్ చేయాలి. లేదా cybercrime.gov.in వెబ్ సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే, దొంగిలించబడిన డబ్బును ఫ్రీజ్ చేసి తిరిగి రాబట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన వివరించారు. కంగారులో ఇచ్చే ఒక్క సమాధానం జీవితకాల సంపాదనను హరించివేయగలదని, కాబట్టి ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎస్ఐఆర్ రగడ.. సుప్రీం మెట్లెక్కిన ఇండియా కూటమి నేతలు

మొదటిపేజీ తరువాయి.. కేంద్ర ఎన్నికల సంఘం (ECI), ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - SIR) ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 'ఇండియా' కూటమి నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా 11 మంది సీనియర్ నేతలు సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేత సౌగతా రాయ్, శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్, సీపీఎం నేత ఎం.ఏ. బేబీ, సీపీఐ నేత డి. రాజా, జేఎంఎం నాయకురాలు మహువా మాఝీ, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత ఈ.టీ. మహ్మద్ బషీర్ పిటిషనర్లుగా ఉన్నారు. ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఇతర కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణకు రావలసి ఉంది. అంతకుముందు ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్‌కు లేఖ రాశామని, అయితే అధికారికంగా పిటిషన్ ద్వారా కోర్టును ఆశ్రయించాలని ఆయన సూచించారని రాహుల్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమతో కలిసి రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష నేతలు సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టారు.

విపక్షాల ఆరోపణలు నిరాధారం: బీజేపీ

'ఇండియా' కూటమి ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఈ వివాదాన్ని విపక్షాలు రాజకీయ ప్రదర్శనగా మార్చాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గురు ప్రకాశ్ పాశ్వాన్ విమర్శించారు. ఆయన ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ, "విపక్షాల ఆరోపణలు పూర్తిగా నిరాధారం. వారు అబద్ధాలు చెబుతున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పు ఇచ్చింది" అని స్పష్టం చేశారు. అస్సాంలోని సిల్చార్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్‌లలో బ్యాలెట్ పేపర్లతో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని, దేశవ్యాప్తంగా ఎన్నికల్లో ఓడిపోతున్నందునే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో జాప్యం.. లబ్ధిదారుల ఇబ్బందులు





ధరల దుకాణాలకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డులను ఒకే చోట సీఆర్‌సీ సెంటర్‌లో పంపిణీ చేయాలని, లేనిపక్షంలో ప్రతి చౌకధరల దుకాణం వద్ద కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు.

వరంగల్, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల విషయంలో అధికారులు సరైన విధానాన్ని అవలంబించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. సోమవారం ఖిలా వరంగల్ తహసీల్దార్ ఎ. ఇక్బాల్‌ను కలిసి ఈ సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు.

గత నాలుగు రోజులుగా సీఆర్‌సీ సెంటర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరగకపోవడంతో కార్డుల కోసం వచ్చే లబ్ధిదారులు అధికారులు ఎప్పుడు వస్తారోనని ఎదురుచూస్తూ పడిగాపులు కాస్తున్నారని మరుపల్ల రవి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా డివిజన్‌లోని అన్ని చౌక

ప్రణాళికాబద్ధంగా కార్డుల పంపిణీ

వినతిపత్రంపై తహసీల్దార్ ఎ. ఇక్బాల్ స్పందిస్తూ.. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీగా పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే జీడబ్ల్యూఎంసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, మెప్మా సిబ్బంది సహకారం కూడా తీసుకుంటామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందుతాయని, లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వనం కుమార్, పోలేపాక రాజన్ బాబు, బండారి ప్రభాకర్ పాల్గొన్నారు.

శ్రీ సంతోష లక్ష్మీ నరసింహ స్వామివారి కళ్యాణోత్సవంలో కొండా సురేఖ

వరంగల్, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్‌లోని న్యూ శాయంపేట ప్రాంతంలో ఉన్న శ్రీ దోనగుట్ట సంతోష లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమం, స్వామివారి కళ్యాణ మహోత్సవంలో మాజీ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ స్వామివారికి విశేష పూజలు, హోమ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని



దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీ సంతోష లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇటువంటి దైవిక వేడుకలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.



లింగాలలో రూ.50 లక్షలతో సీసీ రోడ్ల పనులు ప్రారంభం

ములుగు జిల్లా / తాడ్వాయి, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధిలోని లింగాల గ్రామ పంచాయతీలో రూ.50 లక్షల నిధులతో మంజూరైన 10 సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం గ్రామ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంకిటి నర్సింహ స్వామి ప్రారంభించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ మాట్లాడుతూ లింగాల గ్రామపంచాయతీకి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడంలో మంత్రి సీతక్క కృషి ఎంతో ఉందన్నారు. గ్రామంలోని ప్రతి రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. లింగాల గ్రామపంచాయతీని ములుగు జిల్లాలో ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.లింగాల, కోటిలింగాల, కొడిశెల గ్రామాల ప్రజల తరఫున మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆమె ఆశీస్సులు గ్రామపంచాయతీ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో



కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంకిటి నర్సింహస్వామి, సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ముదురు కోళ్ల తిరుపతి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ప్రశాంత్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నూరు సతీష్, మాజీ సర్పంచ్ ఊకే మౌనిక, మాజీ ఎంపీటీసీ ఊకే రాజు, వార్డు సభ్యులు షాపర్ నరేష్, ఊకే కృష్ణ, చెన్నూరు నరసయ్య, బీపీఎం నాగేశ్వరరావు, ఐటీడీఏ రాము, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన నాయిని నీలిమారెడ్డి

హనుమకొండ, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ పరిధి రెవెన్యూ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాయకుల ఆహ్వానం మేరకు అమ్మవారి మండపానికి చేరుకున్న ఆమెకు ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నాయిని నీలిమారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రజలందరిపై దుర్గామాత ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో,



వైభవంగా కొనసాగుతున్న నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ అధ్యక్షుడు బషీర్, మాజీ అధ్యక్షుడు అఫ్సర్, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించాలి



హనుమకొండ, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ ఎంపీ అంగోమ్మా బిమోల్ అకోయిజామ్‌పై వచ్చిన ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, మహిళా మోర్చా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి, సదరు ఎంపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ అంగోమ్మా బిమోల్ అకోయిజామ్‌పై వచ్చిన ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయని, వాటిపై పారదర్శకంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీపై చర్యలు తీసుకోకపోవడం సరికాదని, విచారణ పూర్తయ్యే వరకు ఆయనను ఎంపీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని కోరారు.చట్టం ముందు అందరూ సమానులేనని, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సంతోష్ రెడ్డి పేర్కొన్నారు. ఆరోపణలపై నిజానిజాలు వెలుగులోకి రావాలంటే నిష్పాక్షిక విచారణ అవసరమని అన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకాంక్ష్ పటేల్ విజయం స్ఫూర్తిదాయకం

- **కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నర్సింహరాములు**



వరంగల్, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ) పరీక్ష ద్వారా కేంద్ర ప్రభుత్వ ఆదాయపు పన్ను శాఖలో సూపరింటెండెంట్‌గా రంగశాయిపేటకు చెందిన ఆకాంక్ష్ పటేల్ ఎంపిక కావడం అభినందనీయమని కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నర్సింహరాములు అన్నారు.ఆకాంక్ష్ పటేల్ సూపరింటెండెంట్‌గా ఎంపికై ఉద్యోగంలో చేరిన సందర్భంగా సోమవారం స్థానికంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహరాములు మాట్లాడుతూ నిరంతర శ్రమ, కృషి, పట్టుదలతో ఆకాంక్ష్ ఉన్నత ఉద్యోగాన్ని సాధించడం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ తనవంతు సహకారం అందించాలని సూచించారు.ఆకాంక్ష్‌ను ప్రోత్సహించి, విజయానికి తోడ్పడిన ఆయన తల్లిదండ్రులు శంకర్‌రావు, వాణిలను అభినందించారు. అనంతరం ఆకాంక్ష్ పటేల్‌ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో సమితి న్యాయ నిర్ణేతలు కత్తి సాంబయ్య, జక్కం దామోదర్, కోల రాము, బొలిశెట్టి కమలాకర్, ఎలుగు రవికుమార్, సుంకర సుధాకర్, బూర సంతోష్ కుమార్, కొట్టే వినయ్ కుమార్, కత్తరపెల్లి వేణు, సుంకర సుజాత దేవి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు కొడుతుండగా విద్యుదాఘాతం.. వృద్ధుడి మృతి

పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): చెట్ల కొమ్మలు కొడుతుండగా విద్యుత్ తీగలు తగిలి 85 ఏళ్ల వృద్ధుడు మృతి చెందిన విషాద ఘటన మంథని మండలం రచ్చపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. చెట్టుకు సమీపంలో విద్యుత్ తీగలు ఉన్నప్పటికీ భద్రతా చర్యలు తీసుకోకుండా పనికి ఆదేశించారంటూ మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంథని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం.. రచ్చపల్లి గ్రామానికి చెందిన కాయితి లింగయ్య (85) సోమవారం ఉదయం రహదారి పక్కన ఉన్న చెట్ల కొమ్మలు కొడుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. గ్రామ పంచాయతీ సిబ్బంది వాంకుడోత్ శివయ్య సూచన మేరకు ఉదయం సుమారు 8 గంటల సమయంలో లింగయ్య చెట్టు ఎక్కి కొమ్మలు కొడుతున్నాడు. ఈ క్రమంలో చెట్టుకు సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే అతడిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



భద్రతా చర్యలు తీసుకోలేదని ఫిర్యాదు

మృతుడి కుమారుడు కాయిత శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో, చెట్టుకు సమీపంలో విద్యుత్ తీగలు ఉన్నప్పటికీ ఎలాంటి హెచ్చరికలు లేదా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోకుండా తన తండ్రితో కొమ్మలు కొట్టించారని ఆరోపించారు. ఈ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఫిర్యాదు ఆధారంగా వాంకుడోత్ శివయ్యపై కేసు నమోదు చేసినట్లు మంథని ఎస్ఐ ఎన్. సందీప్ కుమార్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

హనుమకొండ హాఫ్ మారథాన్ టీషర్ట్స్ ఆవిష్కరణ

- ఈ నెల 17న ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026 రెండో ఎడిషన్
- యువతలో ఆరోగ్యంపై అవగాహనకు మారథాన్‌లు దోహదం : విష్ణురెడ్డి



హనుమకొండ, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండలో ఈ నెల 17న ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026 రెండో ఎడిషన్‌కు సంబంధించిన టీషర్ట్స్‌ను నిర్వాహకులు, యువ నాయకుడు విష్ణురెడ్డి ఆవిష్కరించారు. వరంగల్ క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, మారథాన్ నిర్వాహకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విష్ణురెడ్డి మాట్లాడుతూ.. మారథాన్‌ల నిర్వహణ ద్వారా యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రీడా స్ఫూర్తి, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించవచ్చని పేర్కొన్నారు. నిత్యం వ్యాయామం చేయడం, ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం ద్వారా మెరుగైన జీవనాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. మారథాన్ వంటి కార్యక్రమాలు యువతకు స్ఫూర్తి నిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భారత స్థిరాస్తి అభివృద్ధిదారుల సంఘం (క్రెడాయ్) వరంగల్ అధ్యక్షుడు నాయిని అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాకమూరి అమరేశ్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, వరంగల్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, ఏసీపీ సత్యనారాయణ, సీఐలు రంజిత్, వెంకన్న, క్రెడాయ్ సభ్యులు, మారథాన్ రన్నర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలి

- విద్య, రక్షణ, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి: డా. అనితా రెడ్డి



హన్మకొండ, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): సమాజంలో బాలికల విద్య, రక్షణ, సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చి తమవంతు సహకారం అందించాలని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డా. అనితా రెడ్డి పిలుపునిచ్చారు.అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని హన్మకొండలోని ప్రభుత్వ బాలికల బాలసదనంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. అనితా రెడ్డి బాలికలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాజంలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికల హక్కులను పరిరక్షించడంతో పాటు, పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలని తెలిపారు.బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.అనంతరం బాలికల హక్కుల పరిరక్షణ, బాల్యవివాహాల నిర్మూలనపై చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో బాలసదనం నిర్వాహకులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ ఢిల్లీలో కాంగ్రెస్ పాదయాత్ర

- జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొన్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, ఉమ్మడి వరంగల్ ఎమ్మెల్యేలు



ఢిల్లీ, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి):ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పాదయాత్ర, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, జాటోతు రామచంద్ర నాయక్, కె.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమ్మిండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.



ములుగులో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణకు రూ.3 కోట్లు



ములుగు జిల్లా , అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు నియోజకవర్గంలో నివాస గృహాల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. మంత్రి దనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి మేరకు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించడంతో ఈ నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు ఈ నెల 8న ఇంధన శాఖ ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 32 జారీ చేసింది.నివాస గృహాల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రమాదాల ముప్పును మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ లైన్లను మార్చడంతో పాటు అవసరమైన చోట విస్తరణ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.మంత్రి విజ్ఞప్తిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించి నిధుల మంజూరుకు ఆమోదం తెలిపారు. మొత్తం రూ.3 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతించింది.ఆర్థిక శాఖ సమ్మతితో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పనుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నిధులతో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులు పూర్తయితే ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గడంతో పాటు ప్రజల భద్రతకు మరింత భరోసా కలగనుంది. దీర్ఘకాలంగా నెలకొన్న సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న మంత్రి సీతక్కకు ములుగు నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

అర్ధరాత్రి వేళల్లో పోలీసుల తనిఖీలు.. 28 మందిపై కేసులు!

- మిల్స్ కాలనీలో 'ఆపరేషన్ చెబుత్రా' నిర్వహణ10 ద్విచక్ర వాహనాలు, 24 సెల్‌ఫోన్లు స్వాధీనం



వరంగల్, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యంగా మిల్స్ కాలనీ పోలీసులు 'ఆపరేషన్ చెబుత్రా' నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో 28 మందిని అదుపులోకి తీసుకొని, వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా 10 ద్విచక్ర వాహనాలు, 24 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్, అబ్బనికుంట, లేబర్ కాలనీ, ఫోర్ట్ వరంగల్, శివనగర్, ఎస్.ఆర్.ఆర్. తోట, ఉర్సుగుట్ట, కరీమాబాద్, ఉర్సు, శంభునిపేట, రంగశాయిపేట తదితర ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై సంచరించడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తూ అల్లరి చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన 28 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 15 మందిపై పోలీసు చట్టంలోని సెక్షన్ 70(ఏ) కింద కేసులు నమోదు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ అల్లరి చేసిన మరో 13 మందిపై సెక్షన్లు 21, 70, 76 కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అదుపులోకి తీసుకున్న 28 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా బయట తిరగడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా ప్రవర్తించడం వల్ల ఎదురయ్యే పరిణామాలను వివరించారు.



ప్రతిరోజూ కొనసాగనున్న తనిఖీలు

'ఆపరేషన్ చెబుత్రా' నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, ఇకపై ప్రతిరోజూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కర్రె స్వామి తెలిపారు. రాత్రి వేళల్లో అత్యవసరమైతే తప్ప బయట తిరగవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు మంగీలాల్, ఎస్. శ్రీనివాస్, ఐ. శ్రీనివాస్, శ్యాంసుందర్‌తో పాటు పలువురు ఎస్సైలు, నేర పరిశోధన విభాగం ప్రత్యేక బలగాలు, త్వరిత స్పందన బృందం సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 40 మంది పోలీసు సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం



భూపాలపల్లి, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి):ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 12 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్న ఆయన, సంబంధిత పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్య స్వభావాన్ని వివరించారు. ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తుల ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీసు శాఖ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ వెల్లడించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

అన్నపూర్ణాదేవి అలంకారంలో భద్రకాళీ అమ్మవారు

- **భద్రకాళీ దేవస్థానంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు**
- **మకర వాహనం, చంద్రప్రభ వాహన సేవల్లో దర్శనమిచ్చిన అమ్మవారు**



హనుమకొండ / భద్రకాళి ఆలయం , అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయుల రాజధానిగా, ఏకశిలా నగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం నిత్యాహ్నిక కార్యక్రమాల అనంతరం అర్చకులు అమ్మవారిని అన్నపూర్ణేశ్వరి అలంకారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.ఉదయం నవదుర్గలలో రెండో రూపమైన బ్రహ్మచారిణి దుర్గగా, సాయంత్రం దేవజా దుర్గగా అమ్మవారికి పూజారాధనలు నిర్వహించారు. ఉదయం మకర వాహన సేవ, సాయంత్రం చంద్రప్రభ వాహన సేవలపై అమ్మవారిని ఊరేగించారు. మకర వాహనంపై గంగాభవానిగా, చంద్రప్రభ వాహనంపై రాజరాజేశ్వరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.బ్రహ్మచారిణి దుర్గను ఆరాధించడం వల్ల సాధకులకు జ్ఞానం, ఆధ్యాత్మిక పురోగతి కలుగుతాయని, దేవజా దుర్గ ఆరాధన దుష్టశక్తులను తొలగిస్తుందనే విశ్వాసం ఉందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు వివరించారు. మకర వాహనంపై గంగాభవానిగా అమ్మవారిని దర్శించుకోవడం వల్ల జలగండాలు తొలగుతాయని, చంద్రప్రభ వాహనంపై రాజరాజేశ్వరిగా దర్శనమివ్వడం వల్ల మనస్సు స్థిరపడి ఆధ్యాత్మిక సాధనపై ఏకాగ్రత పెరుగుతుందని భక్తుల విశ్వాసమని తెలిపారు.మూడో రోజు అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించనున్న నేపథ్యంలో, మంత్రదీక్షకు ముందు తల్లి చేతులతో భోజనం చేయించే సంప్రదాయానికి సంకేతంగా రెండో రోజు అన్నపూర్ణేశ్వరి అలంకారం నిర్వహిస్తారని వివరించారు. అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారిని దర్శించుకోవడం వల్ల ఆకలి బాధలు తొలగి, అన్నసమృద్ధి కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారని పేర్కొన్నారు. అనంతరం మహిళలు ఆలయ మహామండపంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

భక్తులను అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం నిర్వహించిన హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తి పారవశ్యంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. సోమవారం కార్యక్రమాలకు నూర్యకుటీర్ అధినేతలు తంగళ్లపల్లి తిరుమలాదేవి–సంపత్‌కుమార్, హర్షవర్ధన్–డాక్టర్ మానస దంపతులు, కుమారి వైష్ణవి, బైరి రవికృష్ణగౌడ్–సరోజన, హరికృష్ణ–హరిత, ఊడుగుల సాయికిరణ్–డాక్టర్ హర్షిత దంపతులు, గీతాభవన్, రాఘవేంద్ర టిఫిన్స్ హోటళ్ల అధినేతలు బాలచంద్రహోళ్ళ–రేణుక దంపతులు, చంద్రశేఖరశెట్టి–జ్యోతి దంపతులు, కొప్ప నాగరాజశెట్టి–ప్రభావతి దంపతులు, అన్నపశెట్టి–హేమ దంపతులు, సందీప్ దీవెశెట్టి–సమ్రత దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రజాస్వామికవాదులు ఐక్యం కావాలి



ఎల్కతుర్తి, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామికవాదులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు ఐక్యంగా ముందుకు రావాలని భారత రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక హుస్నాబాద్ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎల్కతుర్తి అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాల ఆధారంగా రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగం కుల, మత, లింగ వివక్షలకు తావులేకుండా ప్రజలందరికీ హక్కులు కల్పించి, సామాజిక న్యాయాన్ని పరిరక్షించే లక్ష్యంతో రూపొందించబడిందని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. అయితే రాజ్యాంగాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజల హక్కులను, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కోరారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల్లోని ప్రజాస్వామికవాదులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చి రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు వాటి పరిరక్షణకు సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

గురువారం మండల కమిటీ ఏర్పాటు సమావేశం

భారత రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక ఎల్కతుర్తి మండల కమిటీ ఏర్పాటులో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలో సమావేశం నిర్వహించనున్నట్లు కవ్వ లక్ష్మారెడ్డి తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేసే ప్రజాస్వామికవాదులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, బహుజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో డ్యాగల సారయ్య, సాతూరి చంద్రమౌళి, చదిరం నాగేశ్వర్, అడ్డూరి అనిల్, బొంకురి రాజ్, గొల్లపల్లి రవి, బొంకురి వంశీ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు గోడపత్రిక ఆవిష్కరణ



హనుమకొండ, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి):కాకతీయ విశ్వవిద్యాలయం సూక్ష్మజీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 3, 4 తేదీల్లో నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సు గోడపత్రికను ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. “సుస్థిర భవిష్యత్తు కోసం సూక్ష్మజీవులు – నూతన ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న పరిశోధనా దృక్కోణాలు” అనే అంశంపై ఈ సదస్సును నిర్వహించనున్నారు.వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో సూక్ష్మజీవుల ఆధారిత సాంకేతికతలు సుస్థిర అభివృద్ధికి ఏ విధంగా దోహదపడతాయనే అంశంపై సదస్సులో చర్చించనున్నారు. ఆయా రంగాల్లో వస్తున్న నూతన ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న పరిశోధనా అవకాశాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.ఈ జాతీయ సదస్సులో పాల్గొనేందుకు పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థుల నుంచి పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నట్లు సూక్ష్మజీవశాస్త్ర విభాగాధిపతి, సదస్సు నిర్వాహక కార్యదర్శి, సమన్వయకర్త డాక్టర్ ఈ. సుజాత, సదస్సు చైర్మన్ డాక్టర్ పి. వెంకటయ్య తెలిపారు. సంబంధిత రంగాల్లో పరిశోధనలు చేస్తున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ప్రత్యేక అధికారి ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, పాలక మండలి సభ్యులు ఆచార్య మల్లం నవీన్, డాక్టర్ బి. రమ, డాక్టర్ చిర్రా రాజు, కే. అనితారెడ్డి, పుల్లూరు సుధాకర్, ప్రాంగణ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, ఆచార్య వై. వెంకయ్య, ఆచార్య ఆర్. మల్లికార్జునరెడ్డి, డాక్టర్ సూర్య, డాక్టర్ గోపీనాథ్, విశ్వవిద్యాలయ ఇంజనీర్ శంకరయ్య, డాక్టర్ సి.హెచ్. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు దినోత్సవం.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటిన ఆర్టీఐ కమిటీ సభ్యులు



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి):
సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాచార హక్కు చట్ట సాధన కమిటీ పెద్దపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంథని మండలం లక్కేపూర్ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు పాండ్రాల రాజు నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కమిటీ సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించడంతోపాటు నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించాలని సభ్యులు సూచించారు. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా అవి ఎదిగే వరకు సంరక్షించినప్పుడే ఆశించిన ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ప్రజలు ఈ చట్టంపై అవగాహన పెంచుకుని ప్రభుత్వ పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంబంధించిన సమాచారాన్ని చట్టబద్ధంగా పొందాలని సూచించారు. సమాచార హక్కుపై అవగాహన కల్పించడంతోపాటు సామాజిక బాధ్యతను చాటే కార్యక్రమాలను కొనసాగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాండ్రాల రాజు, జిల్లా ఇన్‌చార్జి తోగరి సురేష్, జిల్లా సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జి కొమురోజు సురేష్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు వేగోలపు సురేష్, జిల్లా అధికార ప్రతినిధి కాశిపేట శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు యాసం శ్రావణ్, జిల్లా కార్యదర్శి బూడిద అనిల్, ఆర్ల సనిల్ పాల్గొన్నారు.అలాగే మంథని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రామడుగు శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి సాయి చరణ్, ఉపాధ్యక్షుడు బూడిద రాజు, రామగుండం డివిజన్ ఉపాధ్యక్షుడు రామచందర్, మంథని డివిజన్ సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జి ఎల్పుల సామ్రాట్ పాల్గొన్నారు. లక్కేపూర్ సర్పంచ్ ఈసంపల్లి లక్ష్మీ శ్రీనివాస్, ఉపసర్పంచ్ తోగరి సురేష్, తోటగోపయ్యపల్లి సర్పంచ్ దొబ్బల రమేష్, పంచాయతీ కార్యదర్శి ప్రవళిక, వార్డు సభ్యులు బొడ్డు శేఖర్, గుంజపడుగు స్వాతి కుమార్, తోగరి మౌనిక కిరణ్, మంథని సులోచన సంపత్, బడికెల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ శాశ్వత కార్యాలయానికి స్థల పరిశీలన

- **చింతగట్టు శిబిరంలో ఎస్సారెస్పీ భూములను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**
- **ఆధునిక డ్రైవింగ్ పరీక్షా మార్గం, స్వయంచాలక వాహన పరీక్షా కేంద్రంఏర్పాటుపై దృష్టి**



హనుమాకొండ/ హసన్‌పర్తి, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మించేందుకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సోమవారం స్థల పరిశీలన చేపట్టారు. చింతగట్టు శిబిరంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు భూములను రవాణా, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులతో కలిసి పరిశీలించి, కార్యాలయ నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించే అంశంపై సమీక్షించారు.చింతగట్టు శిబిరంలో ప్రస్తుతం కొనసాగుతున్న రవాణా శాఖ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, విద్యుత్ ఉపకేంద్రం పక్కన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు భూములను పరిశీలించారు. జిల్లా రవాణా శాఖకు శాశ్వత భవనంతో పాటు స్వయంచాలక వాహన పరీక్షా కేంద్రం, ఆధునిక డ్రైవింగ్ పరీక్షా మార్గం ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూమి లభ్యతపై అధికారులతో చర్చించారు. రవాణా శాఖ కార్యాలయం, అనుబంధ సౌకర్యాల ఏర్పాటుకు సుమారు ఏడు ఎకరాల భూమి అవసరమని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీంతో చింతగట్టు శిబిరంలోని ప్రత్యామ్నాయ స్థలాన్ని మరోసారి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అందుబాటులో ఉన్న భూమి విస్తీర్ణం, నిర్మాణాలకు అనుకూలత తదితర అంశాలతో నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో ఉప రవాణా కమిషనర్ సురేష్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి జనార్దన్‌రెడ్డి, నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ మంగీలాల్, ఉప ఇంజనీర్ రవి, హసన్‌పర్తి తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. హసన్‌పర్తిలో విద్యుత్ ఉపకేంద్రానికి స్థల పరిశీలనహసన్‌పర్తిలో నూతన విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కూడా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పరిశీలించారు. హసన్‌పర్తి పోలీసు క్వార్టర్ల వద్ద ఉన్న స్థలాన్ని సందర్శించి, అక్కడ 33/11 కిలోవోల్టుల విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలపై అధికారులతో చర్చించారు.పోలీసు క్వార్టర్ల ప్రాంతంలోని భవనాలు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న నేపథ్యంలో, సంబంధిత స్థలాన్ని సర్వే చేసి పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. చింతగట్టు శిబిరం సమీపంలోని ప్రస్తుతం ఉన్న విద్యుత్ ఉపకేంద్రానికి అదనపు భూమి అవసరాన్ని గుర్తించి, సంబంధిత ప్రతిపాదనలు పంపించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో విద్యుత్ శాఖ ఉప ఇంజనీర్ మల్లికార్జున్, సహాయ విభాగపు ఇంజనీర్ అశోక్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తోటి ఆటో డ్రైవర్ కుటుంబానికి అండగా నిలిచిన సహచరులు



హనుమకొండ జిల్లా / మడికొండ, (నిత్యం నిఘా ప్రతినిధి): తోటి ఆటో డ్రైవర్ ఆకస్మిక మరణంతో విషాదంలో ఉన్న కుటుంబానికి సహచర డ్రైవర్లు అండగా నిలిచి మానవ త్వాన్ని చాటుకున్నారు. మడికొండకు చెందిన మండల బిక్షపతి దశదినకర్మ సందర్భంగా తెలంగాణ ఆటో డ్రైవర్ యూనియన్ (టీఏడీయూ) మడికొండ అడ్డా అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రైవర్లు డెత్ ఫండ్ ద్వారా సేకరించిన ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించిన యూనియన్ సభ్యులు, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తోటి డ్రైవర్ కుటుంబానికి సహాయం అందించడం ద్వారా యూనియన్ సభ్యులు ఐక్యతను, సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో బరిగెల కృష్ణమూర్తి, ఎండీ సలీం, కోరే యాకయ్య, బానోతు నారాయణ, వల్లపు రమేష్, భోగిరాజు, మోడం ముకుందం, చల్ల సతీష్, బుర్ర ఎల్లాగౌడ్, దోమ నరేష్ పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- **పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**
- **జిల్లావ్యాప్తంగా ప్రజావాణికి 225 అర్జీలు**



హనుమకొండ, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, ప్రతి ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్, హనుమకొండ, పరకాల రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయాలు, జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారుల కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని అధికారులు ప్రాధాన్యంతో పరిశీలించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు సత్వర సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాలకు మొత్తం 225 అర్జీలు అందాయి. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో 98 అర్జీలు, హనుమకొండ, పరకాల రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయాల్లో 30 అర్జీలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారుల కార్యాలయాల్లో 97 అర్జీలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, స్థానిక సంస్థల జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌టీఆర్ కేసులను త్వరగా పరిష్కరించి ఆదివాసీలకు న్యాయం చేయాలి



ములుగు జిల్లా / వాజేడు, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): ఏజెన్సీ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న భూమి బదలాయింపు నియంత్రణ చట్టం (ఎల్‌టీఆర్) కేసులను త్వరగా పరిష్కరించి ఆదివాసీలకు న్యాయం చేయాలని ఆదివాసీ నవనిర్మాణ సేన (ఏఎన్ఎస్) ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ కోరారు. సోమవారం వాజేడు మండల ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఆధ్వర్యంలో నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఏజెన్సీ ఎస్‌డీసీ కోర్టు నుంచి వచ్చిన ఎల్‌టీఆర్ కేసులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో గుర్తించి, సంబంధిత న్యాయ ప్రక్రియను గౌరవిస్తూ వాటిని త్వరితగతిన పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. భూములపై హక్కులకు సంబంధించి ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఆదివాసీలకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే పీసా చట్టం ప్రకారం గ్రామసభ తీర్మానం లేకుండా ఎలాంటి కాంట్రాక్టు పనులు ప్రారంభించకూడదని పేర్కొన్నారు. ఆదివాసీ గ్రామాల అభివృద్ధి పనుల్లో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎస్ నాయకులు, సామాజిక మాధ్యమాల ప్రతినిధి పాయం అజయ్‌కుమార్, తల్లాడి ప్రసాద్, మహేష్, తల్లండి సంతోష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూభారతి పోర్టల్‌లో భూముల నమోదు వ్యవహారంపై ఫిర్యాదు



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): భూభారతి పోర్టల్‌లో భూముల నమోదు, నిషేధిత జాబితా మార్పులు, మార్కెట్ విలువల నిర్ధారణపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మంథని రాజగోపాల్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఒకవైపు నిషేధిత జాబితాలో ఉన్న భూమికి రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని, మరోవైపు సక్రమమైన భూములకు సంబంధించిన సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదని ఆయన ప్రశ్నించారు. భూముల రికార్డులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి, తప్పులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిషేధిత భూమికి రిజిస్ట్రేషన్ ఎలా?

మంథని గ్రామంలోని సర్వే నంబర్ 94/బి, ఇంటి నంబర్ 2-5/ఏకు సంబంధించిన భూముల వ్యవహారంలో 1992 నాటి కట్టడాలు, ఇంటి రికార్డులు, 788/1982 పత్రం వివరాలను ఫిర్యాదులో ప్రస్తావించారు. సర్వే నంబర్ 94/డి పరిధిలోని భూమి నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ జరిగినట్లు ఆరోపించారు. సుమారు 40 సెంట్ల భూమికి సంబంధించిన రికార్డులు, నిషేధిత జాబితా వివరాలను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని కోరారు.

రూ.82 లక్షల విలువైన భూమికి రూ.5.62 లక్షల విలువేనా?

సంబంధిత భూమి మార్కెట్ విలువ సుమారు రూ.82 లక్షలు ఉంటుందని, అయితే ఖాతా నంబర్ 61183కు సంబంధించిన 0.0526 గుంటల విస్తీర్ణానికి రూ.5.60 లక్షలుగా విలువ చూపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.5,62,500 విలువ ఆధారంగా స్టాంపు సుంకం, రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగినట్లు ఆరోపించారు. భూమి వాస్తవ మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకున్నారా? ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరిగిందా? అనే అంశాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

నిషేధిత జాబితా నుంచి తొలగింపుపై అనుమానాలు

భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియలో నిబంధనలు పాటించారా? సంబంధిత అధికారుల అనుమతులు తీసుకున్నారా? అనే అంశాలపై రాజగోపాల్ అనుమానాలు వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయ ప్రవేశ వివరాల ద్వారా భూమి రికార్డుల్లో మార్పులు జరిగాయన్న ఆరోపణలపై సాంకేతిక రికార్డులను పరిశీలించి నిజానిజాలు తేల్చాలని కోరారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

మరో సర్వే నంబరులోనూ భూ సమస్య

మంథని పరిధిలోని సర్వే నంబర్ 1112/ఏ, బి, సి, డి పరిధిలో ఉన్న రెండు ఎకరాల భూమికి సంబంధించి పత్రం నంబర్ 2209/2011, పట్టా వివరాలు, ఎస్ఎల్ఎన్ఎస్/2020/1 దరఖాస్తు తేదీ 26-08-2020ను ఫిర్యాదులో ప్రస్తావించారు. సంబంధిత భూమి రికార్డులు, దరఖాస్తు ప్రస్తుత స్థితి, రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పారదర్శక విచారణతో వాస్తవాలు వెలుగులోకి తేవాలి

భూభారతి పోర్టల్‌లో భూముల రికార్డుల నిర్వహణ, నిషేధిత జాబితాలో మార్పులు, మార్కెట్ విలువల నిర్ధారణపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని మంథని రాజగోపాల్ విజ్ఞప్తి చేశారు. అర్హులైన భూ యజమానులకు న్యాయం చేయడంతోపాటు, నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్



ఎల్కతుర్తి, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి):హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ సోమవారం వారి కుటుంబాలను పరామర్శించారు. ఎల్కతుర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు జంగం రాజు, సూరవరం వేమారెడ్డి, వీరనారాయణపూర్ గ్రామ బీఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు చదిరం రమేష్ స్వగృహాలకు వెళ్లి వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి మృతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. కష్టకాలంలో బీఆర్ఎస్ పార్టీ వారి కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్, తంగేడ మహేందర్, గొల్లే మహేందర్, శేషగిరి, కడారి రాజు, కుర్ర సాంబమూర్తి గౌడ్, కోరే రాజ్‌కుమార్, చదిరం నాగేశ్వర్, శ్రీనివాస్, జూపాక జడ్సన్‌తో పాటు మండల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంథని గోదావరిలో మట్టి పనులు నిలిపివేయాలి



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని పట్టణంలోని గోదావరి నదిలో యంత్రాలతో చేపడుతున్న మట్టి పనులను నిలిపివేసి, పుష్కర ఘాట్ నిర్మాణ పనులపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి డిమాండ్ చేశారు. పుష్కర ఘాట్ నిర్మాణం పేరుతో నదిలో నిల్వ ఉన్న నీటిని మట్టితో పూడ్చుతూ, ఇసుక, బండరాళ్లు వంటి సహజ వనరులకు నష్టం కలిగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మంథని అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నదీ పర్యావరణానికి ముప్పు ఉందంటూ ఆందోళన

గోదావరి నదిలో భారీ యంత్రాలతో పనులు చేపట్టడం వల్ల నది సహజ స్వరూపం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని తిరుపతి ఆందోళన వ్యక్తం చేశారు. వన్య ప్రాణుల సంరక్షణ చట్టం–1972 నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయనే ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ జరపాలని కోరారు. పనులకు అవసరమైన అనుమతులు, నిబంధనల అమలు, నదీ పర్యావరణంపై వాటి ప్రభావాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.పనులు నిలిపివేయకుంటే ఉన్నతస్థాయి ఫిర్యాదులుగోదావరిలో జరుగుతున్న పనులపై అధికారులు తక్షణమే స్పందించి, ఆరోపణలపై విచారణ చేపట్టాలని బూడిద తిరుపతి కోరారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులైన కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పనులు నిలిపివేసి తగిన చర్యలు తీసుకోకపోతే జాతీయ హరిత ట్రైబ్యునల్, కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖలకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.గోదావరి నది సహజ వనరులను కాపాడటంతోపాటు పర్యావరణ పరిరక్షణకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. నదిలో జరుగుతున్న పనులపై అధికారుల విచారణ అనంతరం వాస్తవాలు వెల్లడికావాల్సి ఉంది.

పవనసుతా రైస్ మిల్లుపై రూ.13 కోట్ల ధాన్యం బకాయిల ఆరోపణలు

పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని గంగపూరి గ్రామానికి చెందిన పవనసుతా రైస్ మిల్లుకు సంబంధించి ప్రభుత్వ ధాన్యం బకాయిల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. 2021–22 సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.13 కోట్ల మేర బకాయిలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. మిల్లు యజమాని రావికంటి పవన్‌కుమార్‌కు సంబంధించిన ధాన్యం కేటాయింపులు, మిల్లింగ్ వివరాలు, ప్రభుత్వానికి బియ్యం అప్పగించిన లెక్కలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ధాన్యం కేటాయింపులపై అనుమానాలు,

బాయిల్డ్ రైస్ తయారీకి అనువుగా లేని మిల్లుకు వేసంగి ధాన్యం ఎలా కేటాయించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలకు అనుగుణంగానే ధాన్యం కేటాయింపులు జరిగాయా? మిల్లుకు కేటాయించిన ధాన్యం ఎక్కడికి తరలించారు? సూరయ్యపల్లిలోని శ్రీలక్ష్మీ రైస్ మిల్లుకు పవనసుతా రైస్ మిల్లుకు సంబంధించిన ధాన్యం ఎలా చేరింది? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

అధికారుల పాత్రపైనా విచారణ జరపాలి

ధాన్యం కేటాయింపులు, మిల్లింగ్ ప్రక్రియ, ప్రభుత్వానికి బియ్యం అప్పగింతలు, బకాయిల వసూళ్లకు సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్ పాత్రపైనా విచారణ జరిపి నిజానిజాలను తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ వెలువడాల్సి ఉంది.

బకాయిలు ఉంటే వసూలు చేయాలి

ప్రభుత్వానికి రావాల్సిన ధాన్యం లేదా బియ్యం బకాయిలు ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం వాటిని వసూలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగి మిల్లుల రికార్డులు, ధాన్యం రవాణా



వివరాలు, నిల్వల లెక్కలను తనిఖీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కోరారు.

రూ.13 కోట్లుగా చెబుతున్న బకాయిల వాస్తవ పరిస్థితి ఏమిటి? ధాన్యం కేటాయింపులు, బియ్యం అప్పగింతల్లో నిబంధనలు పాటించారా? ప్రభుత్వానికి ఆర్థిక నష్టం జరిగిందా? జరిగితే బాధ్యులెవరు? అనే ప్రశ్నలకు అధికారిక విచారణతోనే సమాధానం లభించనుంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్టీఐ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ములుగు జిల్లా / మల్లంపల్లి, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): సమాచార హక్కు చట్టం–2005పై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం మల్లంపల్లి మండల ప్రజావాణి స్వీకరణ అధికారికి వినతిపత్రం అందజేశారు.మండలంలోని గ్రామపంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజా సమాచార అధికారుల పేర్లు, సంప్రదింపు వివరాలు, దరఖాస్తు చేసుకునే విధానాన్ని కార్యాలయాల్లో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, గ్రామపంచాయతీ నిధులు, అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు సులభంగా తెలుసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన సమాచారాన్ని స్వచ్ఛందంగా



వెల్లడించాలని శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా సమాధానాలు అందేలా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. సమాచారం అందని సందర్భాల్లో మొదటి అప్పీలు చేసుకునే విధానంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు ప్రభుత్వ పాలనకు సంబంధించిన వివరాలు తెలుసుకునే అవకాశం ఉందని, ఈ చట్టం అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని శ్రీకాంత్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై తీసుకున్న చర్యలను ప్రజలకు తెలియజేయాలని కోరారు.

మంథని ప్రఖండ భజరంగ్ దళ్ నూతన కమిటీ ఎన్నిక

పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 12 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద సోమవారం విశ్వహిందూ పరిషత్ మంథని ప్రఖండ భజరంగ్ దళ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వహిందూ పరిషత్ కరీంనగర్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, పెద్దపల్లి జిల్లా భజరంగ్ దళ్ సంయోజక్ సంపత్ యాదవ్ హాజరయ్యారు. వారి సమక్షంలో విశ్వహిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ గుప్తా నూతన కమిటీని అధికారికంగా ప్రకటించారు.నూతన మంథని ప్రఖండ భజరంగ్ దళ్ సంయోజక్‌గా నరేడ్ల రాజేష్, సహ సంయోజకులుగా జంబోజు సాయి, భోగే సందీప్ ఎన్నికయ్యారు. గోరక్షా ప్రముఖ్‌గా తోగరి రాజ్‌కుమార్, సురక్షా ప్రముఖ్‌గా ఎడ్ల ఉమేశ్, బలోపాసన కేంద్ర ప్రముఖ్‌గా జంగపల్లి అభిషేక్, అఖాడా ప్రముఖ్‌గా వడ్లకొండ శ్రావణ్, విద్యార్థి ప్రముఖ్‌గా దేవాంశ్ బాధ్యతలు చేపట్టనున్నారు. కమిటీ సభ్యులుగా తాటి రాము, రాంబాబు, ఎరుకల రాజేష్, తేజు, రమేష్ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మంథని ప్రఖండ అధ్యక్షుడు రావుల




సతీష్, ఉపాధ్యక్షుడు బోట్ల ఆంజనేయులు, సత్సంగ్ ప్రముఖ్ కొమురవెల్లి హరీష్, సహ కార్యదర్శి గుండా శ్రీనివాస్, ఎల్లంకి హరి, మందిర్ మఠ్ ప్రముఖ్ మెడగొని రాజమౌళి గౌడ్‌తో పాటు పరిషత్ సభ్యులు, మాలధారణ స్వాములు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పెద్దలు శుభాకాంక్షలు తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ, సేవా కార్యక్రమాల నిర్వహణ, సమాజ ఐక్యత కోసం అందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మంత్రి సీతక్క ఆదేశాలతో టీ .ఎల్ పేట చెరువుకు మెట్లు

- **యువ సర్పంచ్ ప్రవీణ్ చొరవతో .**
- **ఎంపీడీవో భాగ్య శ్రీ, చేతుల మీదుగా ప్రారంభం**

నిత్యం నిఘా, ఏన్కూర్, అక్టోబర్ 12 : బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు నిమజ్జన సమయంలో సౌకర్యం, భద్రత కల్పించేందుకు మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఏన్కూరు మండల పరిధిలోని టీ.ఎల్ .పేట గ్రామపంచాయతీ పరిధిలోని చెరువు వద్ద ప్రత్యేక మెట్లను నిర్మించారు. వీటిని సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ నామా వెంకయ్య, ఎంపీడీవో పి. భాగ్యశ్రీ, ఎంపీవో ఖాదర్ మియా ప్రారంభించారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా మెట్లకు ఇరువైపులా దాత దంపతులు బండారు కృష్ణయ్య, తిరుపతమ్మ ఇనుప రెయిలింగ్ ఏర్పాటు చేయించారు. పండుగ వేళ మహిళలకు ఉపయోగపడేలా సదుపాయాలు కల్పించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా యువ సర్పంచ్ ప్రవీణ్ చొరవ తీసుకోవడాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇల్లూరి ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి గోపి, సిబ్బంది



బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతలతో రైతుల కన్నీళ్లు.. నీళ్లున్నా ఎండుతున్న పంటలు!

- **నాణ్యమైన విద్యుత్ అందించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: కర్రెడ్ల నరేందర్ రెడ్డి**

నిత్యం నిఘా, కేశంపేట, అక్టోబర్ 12 : గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కర్రెడ్ల నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బోర్లలో నీరు ఉన్నప్పటికీ, సరైన సమయంలో కరెంటు సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు.ఒక బోరు పనిచేస్తే మరో బోరు పనిచేయకపోవడంతో సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుంటే రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల సంక్షేమం గురించి మాట్లాడే ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో వారి సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని సూచించారు.వెంటనే విద్యుత్ సమస్యలను పరిష్కరించి, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, పంట నష్టాలను ఎదుర్కొన్న రైతులను గుర్తించి తగిన సహాయం అందించాలని కర్రెడ్ల నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, వారి పక్షాన నిలబడి పోరాడుతామని స్పష్టం చేశారు.



ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఢిల్లీ గడ్డపై కాంగ్రెస్ గళం



నిత్యం నిఘా, భద్రాద్రికొత్తగూడెం,ఇల్లందు, అక్టోబర్ 12 : ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుతూ,SIR ప్రక్రియను నిలిపి వేయాలని, తొలగించిన ఓట్లను చెర్చాలని,ప్రతి పౌరుడి ఓటు హక్కుకు రక్షణ కల్పించాలని.అఖిల భారత కాంగ్రెస్ కమిటి పిలుపుమేరకు నిర్వహించిన ఛలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా, కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సుప్రీంకోర్టు మార్చ్‌లో పాల్గొని,కొట్లాది మంది ఓట్లను తొలగించిన భారత ఎన్నికల కమిషన్ అధికారి జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర సహచర ఎమ్మెల్యేలతో కలిసి నిరసన వ్యక్తం చేసిన ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య.

TASK నిజామాబాద్ రీజినల్ సెంటర్‌లో DELL-Udaan శిక్షణ కార్యక్రమం


నిత్యం నిఘా, నిజామాబాద్ , అక్టోబర్ 12 : తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (TASK)నిజామాబాద్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో DELL-Udaan శిక్షణ కార్యక్రమానికి రిజిస్ట్రేషన్లు ఆహ్వానిస్తున్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు AI Software Developer మరియు Cloud Software Developer కోర్సుల్లో పరిశ్రమకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలపై శిక్షణ అందించబడుతుంది.AI Software Developer కోర్సుకు CSE, IT, ECE, EEE, AI & ML, AI & DS వంటి విభాగాలకు చెందిన అర్హులైన B.Tech విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.Cloud Software Developer కోర్సుకు B.Sc. (Computers), BCA వంటి అర్హతలు కలిగిన డిగ్రీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.ప్రోగ్రామ్ అర్హత ప్రమాణాల ప్రకారం 2025,2026 పాస్-అవుట్ విద్యార్థులు మరియు 2027లో చదువుతున్న విద్యార్థులు అర్హులు.ఈ శిక్షణలో ప్రాక్టికల్ లెర్నింగ్,హ్యాండ్స్-ఆన్ ప్రాజెక్టులు,పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు మరియు ప్లేస్‌మెంట్ సహాయం వంటి అంశాలు ఉంటాయి.శిక్షణా పాఠ్యప్రణాళికను FITT – IIT Delhi రూపొందించగా,సాంకేతిక సహకారాన్ని Dell Technologies అందిస్తోంది.ప్రోగ్రామ్ నిబంధనలను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు ధృవీకరణ పత్రం అందించబడుతుంది.కార్యక్రమ వివరాలు:రిజిస్ట్రేషన్ చివరి తేదీ: 17 అక్టోబర్ 2026శిక్షణ ప్రారంభ తేదీ: 23 అక్టోబర్ 2026రిజిస్ట్రేషన్ ఫీజు: ₹599/- (ఒకసారి మాత్రమే)వేదిక: TASK Regional Center, IT Tower, Nizamabad, Telangana – 503001సంప్రదించవలసిన నంబర్: 7013675052ఆసక్తి మరియు అర్హత కలిగిన విద్యార్థులు గడువులోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని TASK నిజామాబాద్ రీజినల్ సెంటర్ సూచిస్తోంది. మరిన్ని వివరాలకు పై ఫోన్ నంబర్‌ను సంప్రదించండి.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పెద్దనాగారం విద్యుత్ వినియోగదారులకు అలర్ట్..

11 గంటల పాటు కరెంటు కట్!



నిత్యం నిఘా, పెద్దనాగారం: 5 MVA ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 MVA ట్రాన్స్‌ఫార్మర్.. విద్యుత్ సరఫరా మెరుగుదలకు శాఖ చర్యలు!👉 ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం.. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి!👉 విద్యుత్ పనుల నేపథ్యంలో ముందస్తు సమాచారం.. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచన!పెద్దనాగారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయంపెద్దనాగారం, అక్టోబర్ 12 (నేటి శుభోదయం):పెద్దనాగారం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ప్రస్తుతం సబ్‌స్టేషన్‌లో ఉన్న 5 MVA సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (PTR) స్థానంలో 8 MVA సామర్థ్యం గల నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరచడం, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడం లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు శాఖ వెల్లడించింది.ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంతరాయంవిద్యుత్ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, అక్టోబర్ 13, మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెద్దనాగారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి పనులు పూర్తయ్యే వరకు వినియోగదారులు విద్యుత్ అందుబాటులో ఉండదనే విషయాన్ని ముందుగానే గమనించాలని అధికారులు సూచించారు.రైతులు, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలివిద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వ్యవసాయ పనులు, గృహ అవసరాలు, దుకాణాలు, ఇతర విద్యుత్ ఆధారిత కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా విద్యుత్ మోటార్లపై ఆధారపడే రైతులు తమ వ్యవసాయ పనులను ముందుగానే ప్రణాళిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. విద్యుత్‌పై ఆధారపడే అత్యవసర పనులు ఉన్నవారు తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవడం మంచిది.సామర్థ్యం పెంపుతో మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యం ప్రస్తుతం ఉన్న 5 MVA ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 MVA ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం ద్వారా సబ్‌స్టేషన్ సామర్థ్యం పెరగనుంది. ఈ మార్పుతో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు శాఖ ప్రయత్నిస్తోంది. అయితే, పనులు పూర్తయ్యే సమయం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సంబంధించిన తాజా సమాచారం కోసం వినియోగదారులు స్థానిక విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించవచ్చు.విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకొని పెద్దనాగారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతులు, వ్యాపారులు, ఇతర విద్యుత్ వినియోగదారులు శాఖకు సహకరించాలని మరిపెడ విద్యుత్ శాఖ (TGNPDCL) కోరింది.గమనిక: విద్యుత్ సరఫరా నిలిచిపోయే సమయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అని శాఖ ప్రకటించింది. పనులు పూర్తయ్యే సమయాన్ని బట్టి సరఫరా పునరుద్ధరణలో మార్పులు ఉండవచ్చు.

ప్రజావాణికి 89 ఫిర్యాదులు





నిత్యం నిఘా, నిజామాబాద్, అక్టోబర్ 12 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 89 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు రాజా గౌడ్,వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్,డీఆర్ఓ గీత,జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,డీపీఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోనకల్ గ్రామంలో ఒకేరోజు ఐదు మంచినీటి మినీ ట్యాంకులు ప్రారంభం

- **ప్రజల మంచినీటి కష్టాలపై సర్పంచ్ ప్రత్యేక దృష్టి**
- **ప్రజల అవసరాలే ప్రాధాన్యం.. బోనకల్‌లో ఎస్ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మంచినీటి సదుపాయాల విస్తరణ**
- **ప్రజల తాగునీటి ఇబ్బందుల పరిష్కారమే లక్ష్యం**
  — సర్పంచ్ బానోతు జ్యోతి కొండ







నిత్యం నిఘా, బోనకల్, అక్టోబర్ 12 : గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను గుర్తించి, వారికి మెరుగైన మంచినీటి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా బోనకల్ గ్రామపంచాయతీ ముందుకు సాగుతోంది. గ్రామంలో మంచినీటి కొరతను తగ్గించేందుకు సంస్థ సహకారంతో మొత్తం 12 మినీ మంచినీటి ట్యాంకులను నిర్మిస్తుండగా, అందులో భాగంగా ఒకేరోజు ఐదు మినీ ట్యాంకులను సోమవారం ప్రారంభించడం సంతోషంగా ఉందని బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వివిధ ప్రాంతాల్లో మినీ ట్యాంకులను ఏర్పాటు చేయడం ద్వారా తాగునీటి సమస్యను కొంతమేర తగ్గించేందుకు కృషి చేస్తున్నామని వారు తెలిపారు.గ్రామంలోని వివిధ కాలనీలు, దేవాలయాల పరిసరాలు, రైతులకు అవసరమైన ప్రాంతాలు, స్మశానవాటిక సమీపంలో ప్రజలకు ఉపయోగపడేలా ఈ మినీ ట్యాంకులను ఏర్పాటు చేయడం విశేషం. ఒకేరోజు ఐదు మినీ ట్యాంకులు ప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం గ్రామాభివృద్ధిలో కీలక మని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కార దిశగా..

గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంచినీటి కొరత కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అక్కడ ఒక మినీ మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. తాగునీటి అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్న స్థానికులకు ఈ ట్యాంకు ఉపయోగకరంగా ఉండనుంది. ముఖ్యంగా కాలనీలోని ప్రజలకు అందుబాటులో మంచినీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేపట్టడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు.ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో కాలనీల వారీగా సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా గ్రామపంచాయతీ చేపడుతున్న చర్యలు ప్రజలకు ఊరటనిస్తున్నాయి.

ముత్యాలమ్మ, తిరుపతమ్మ అమ్మవార్ల ఆలయాల వద్ద మినీ ట్యాంకు

ముత్యాలమ్మ, తిరుపతమ్మ అమ్మవార్ల ఆలయాల వద్దకు వచ్చే భక్తులు, స్థానిక ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అక్కడ ఒక మినీ మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. ఆలయాలకు పూజలు, మొక్కులు, ఇతర కార్యక్రమాల కోసం వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండటం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.ప్రజల ఆధ్యాత్మిక అవసరాలతో పాటు ప్రాథమిక సౌకర్యాలకు కూడా ప్రాధాన్యతనిస్తూ ఈ ట్యాంకును ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శివాలయం సెంటర్ వీధిలో మంచినీటి సౌకర్యం

గ్రామంలోని శివాలయం సెంటర్ వీధిలో మరో మినీ మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ ప్రాంతంలో నివసించే ప్రజలకు, ఆ వీధి మీదుగా రాకపోకలు సాగించే వారికి తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానుంది.ప్రజలు రోజువారీ అవసరాల కోసం మంచినీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ఇలాంటి సదుపాయాలు ఎంతో అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గ్రామంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో నీటి సౌకర్యాలు కల్పించడం ద్వారా మెరుగైన వసతులు అందించేందుకు గ్రామపంచాయతీ చేస్తున్న ప్రయత్నం ప్రశంసనీయమని పేర్కొంటున్నారు.

రైతుల అవసరాలను గుర్తించి మంచినీటి ట్యాంకు ఏర్పాటు

మంచినీళ్ల బాయి సమీపంలో రైతుల అవసరాల కోసం మరో మినీ మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే రైతులు, ఆయా ప్రాంతాల్లో పనిచేసే వారికి తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ ట్యాంకును ఏర్పాటు చేయడం జరిగింది.గ్రామాభివృద్ధి అంటే కేవలం నివాస ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించడమే కాకుండా, గ్రామ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే రైతుల అవసరాలను కూడా గుర్తించడం. ఈ ఆలోచనతో రైతులకు ఉపయోగపడే ప్రాంతంలో మినీ ట్యాంకును ఏర్పాటు చేయడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్మశానవాటిక సమీపంలో తాగునీరు, స్నానాల కోసం ప్రత్యేక సదుపాయం

గ్రామ స్మశానవాటిక సమీపంలో తాగునీటి అవసరాలతో పాటు అంత్యక్రియలకు వచ్చే కుటుంబ సభ్యులు, బంధువులు స్నానాలు చేసుకునేందుకు వీలుగా మరో మినీ ట్యాంకును ఏర్పాటు చేశారు. సాధారణంగా అంత్యక్రియల సమయంలో అక్కడికి వచ్చే ప్రజలు నీటి సౌకర్యం కోసం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉంటాయి.ఈ అవసరాన్ని గుర్తించి స్మశానవాటిక సమీపంలో నీటి సౌకర్యం కల్పించడం ద్వారా ప్రజలకు ఉపయోగపడే ఏర్పాటు చేసినట్లు గ్రామస్థులు భావిస్తున్నారు. గ్రామంలో ప్రతి ప్రాంతానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే దృక్పథంతో ఇలాంటి పనులు చేపట్టడం మంచి పరిణామమని పలువురు పేర్కొంటున్నారు.

ఎస్ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ సహకారంతో మొత్తం 12 మినీ ట్యాంకుల నిర్మాణం

గ్రామంలో మంచినీటి కొరతను తగ్గించేందుకు సంస్థ సహకారంతో మొత్తం 12 మినీ మంచినీటి ట్యాంకులను నిర్మిస్తున్నామని సర్పంచ్ బానోతు జ్యోతి కొండ తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఐదు ట్యాంకులను ప్రారంభించామని, ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, అందుబాటులో ఉన్న వనరులు మరియు సంస్థల సహకారంతో పరిష్కారానికి కృషి చేయడం గ్రామపంచాయతీ బాధ్యత అని ఆమె అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ప్రజల సంతోషం.. గ్రామాభివృద్ధికి మరో ముందడుగు

ఒకేరోజు ఐదు మినీ మంచినీటి ట్యాంకులు ప్రారంభం కావడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ప్రజల అవసరాలను గుర్తించి, వారికి ఉపయోగపడే ప్రాంతాల్లో నీటి సదుపాయాలు కల్పించడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను విని, వాటి పరిష్కారానికి కార్యాచరణ చేపట్టినప్పుడే స్థానిక పాలనపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.తాగునీరు ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరం. ఆ అవసరాన్ని గుర్తించి గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో మినీ ట్యాంకులు ఏర్పాటు చేయడం ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమంగా నిలుస్తోంది. మిగిలిన మినీ ట్యాంకుల నిర్మాణం కూడా పూర్తయి అందుబాటులోకి వస్తే గ్రామంలో మంచినీటి సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది.అనంతరం ఎస్ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి షేక్ మహబూబ్ పాషా మాట్లాడుతూ, "బోనకల్ మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా చొరవ తీసుకుని, తమ సొంత ఆర్థిక సహకారంతో కూడా ఈ నిర్మాణంలో భాగస్వామ్యమైన సర్పంచ్, ఉప సర్పంచ్ బానోత్ జ్యోతి కొండ సేవా దృక్పథం అభినందనీయం. ప్రజా సేవలో వారికి ఉన్న అంకితభావానికి ఇది నిదర్శనం. భవిష్యత్తులో ఎస్ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బోనకల్ పంచాయతీలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాము" అని తెలిపారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

ఈ ఐదు మినీ మంచినీటి ట్యాంకులను బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ, ఉపసర్పంచ్ బానోతు కొండ, గ్రామ పంచాయతీ కార్యదర్శి కోల రాజేశ్వరి, ఎస్ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి షేక్ మహబూబ్ పాషా ప్రారంభించారు.ప్రజలకు తాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడంలో సహకరించిన సంస్థకు, ఈ కార్యక్రమానికి కృషి చేసిన వారికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన నిరంతరం కొనసాగాలని, బోనకల్ గ్రామపంచాయతీ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.ఈ కార్యక్రమంలో...గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు.. యార్లగడ్డ కుమారి, మరీదు శేషు, అంతోటి శ్రీను, పోటు వెంకటేశ్వర్లు, అంతోటి సునీత, షేక్ మీరా సాహెబ్, జరుపుల లావణ్య, ఉప్పర శ్రీను, షేక్ నౌషిన్, మరియు గ్రామ పెద్దలు.. సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, బొమ్మ కంటి రంగారావు, తెల్లాకుల శ్రీనివాసరావు, గుగులోతు నాగేశ్వరరావు, నందమూరి సత్యనారాయణ, తేలూరి రమేష్ , యార్లగడ్డ శ్రీను, గంగుల పుల్లయ్య, మోర్ల శ్రీను, యార్లగడ్డ రమేష్, చిట్టూరి శ్రీనివాస ప్రసాద్, మోర్ల ఆంజనేయులు, బండి వెంకటేశ్వర్లు, ఒరుగు నరసింహారావు, టైగర్ విజయ్, గద్దె రామారావు మరియు పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు, స్థానిక గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com